క్లుప్తంగా

808 కుటుంబాలకు నిత్యావసర సరుకులు



మంగళగిరి: ఇటీవల కురిసిన వర్షాలకు సర్వం కోల్పోయిన బాధితులకు బీసీ సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు సరఫరా చేశారు. విజయవాడలోని 808 బాధిత కుటుంబాలకు బియ్యం ,నిత్యావసరకులను ఆదివారం మంగళగిరి నుంచి పంపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పారేపల్లి మహేష్,పారేపల్లి రామకృష్ణ, కాగితాల స్వాతి గౌడ్, కందూరి రాములు,శ్రీకాంత్, జీవన్, వుడతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత రూ.5 లక్షల విరాళం

మంగళగిరి: వరద బాధితుల సహాయార్థం వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిల్లపల్లి వెంకట నాగమోహన రావు భారీ విరాళం అందించారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను మోహనరావు ఆదివారం కలిసి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. లోకేష్ మోహనరావును అభినందించారు.

16 నుంచి పవిత్రోత్సవాలు


తెనాలి: స్థానిక సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు, మహా సుదర్శన హోమం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవాలయ కార్యనిర్వహణ అధికారి అవుతు శ్రీనివాసరెడ్డి ఆలయ ప్రాంగణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు, మహా సుదర్శన హోమం, 18న పూర్ణాహుతి, తిరుప్పావడ సేవ ఉంటాయని అర్చకులు రొంపిచర్ల శ్రీనివాస మూర్తి, కిరణ్‌కుమార్ వివరించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, జంధ్యం రామారావు, మదుపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విశ్వగురుస్థానంపై నిలపాల్సింది ఉపాధ్యాయులే



గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశాన్ని విశ్వగురు స్థానంపై నిలపాల్సింది ఉపాధ్యాయులేనని ప్రముఖ పారిశ్రామికవేత్త తాళ్ల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి రోడ్డులోని కమ్యూనిటీ హాల్లో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలల విజయభేరి విద్యా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. సభాధ్యక్షుడు డి.శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధనతోపాటు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను గుర్తించి వారిని ప్రోత్సాహిస్తూ, తద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ఇటువంటి విద్యా సదస్సులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త తాడిబోయిన సంపత్, రాష్ట్ర వ్యాయమ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడుబి.కరీముల్లా చౌదరి, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జువ్వా జ్ఞానేశ్వరరావు, బందనాదం కుమార్ రాజు, మహిళా నాయకురాలు కె.పద్మకోటి, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మల, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఎంఈఓలు అబ్దుల్ ఖద్దూస్, రమణయ్య, రవికాంత్, జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, బాల సుందర్‌రావు, పినాకపాణి, హెచ్ఎంలు రాజేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం పదిలం



లక్ష్మీపురం: ఆయుర్వేదంతో ఆరోగ్యం పదిలం చేసుకోవాలని సీనియర్ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నాగేంద్ర అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయుర్వేదంలో పంచకర్మ బాగా ప్రసిద్ధి చెందిందని వివరించారు. నాగేంద్రను ఘనంగా సత్కరించారు.

గణపతికి వందనం

మంగళగిరి/తాడేపల్లి రూరల్ : గణపతి నిమజ్జనోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. భారీగా విగ్రహాలు డప్పుచప్పుళ్ల, తీన్‌మార్ వాయిద్యాల మధ్య నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఉరేగింపుల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నృత్యాలు చేశారు. విచిత్ర వేషధారణలు, కోయ నృత్యాలు అందరినీ అలరించాయి. మంగళగిరిలో డీఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ సీఐ వినోద్ పర్యవేక్షణలో 129 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. తాడేపల్లి వైఎస్సార్ సెంటర్ (గేటు సెంటర్)లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు డేవిడ్ రాజు, చిన్నబోతుల దుర్గారావు, మేడా పండు, మహేష్ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, కళ్ళం రాజాలు ప్రారంభించారు. ఉండవల్లి రెడ్ల బజారులో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● కుంచనపల్లిలో జై గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నాలుగువేల మందికి అన్నదానం నిర్వహించారు. 27 కేజీల స్వామి లడ్డూకు వేలం పాట నిర్వహించగా అదే గ్రామానికి చెందిన అంగడి గోపి 2.11 లక్షలకు పాట పాడుకున్నారు. 5 కేజీల లడ్డూను గ్రామానికి చెందిన జి.వెంకటేశ్వరరావు 33 వేల రూపాయలకు పాడుకున్నారు. గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

● ప్రాతూరు అపర్ణ అమరావతి వన్ అపార్ట్‌మెంట్‌లో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆదివారం పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. కమిటీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, సెక్రటరి కొండా ప్రతాప్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. 15 కేజీల లడ్డూను వేలంపాటలో ఫార్చ్యూన్ గ్రూప్ అధినేత కొండా ప్రతాప్‌రెడ్డి రూ.4.59 లక్షలకు పాడుకున్నారు.



తాడేపల్లిలో గణేశ్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



విశేష అలంకారంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడు

వైభవంగా విఘ్నేశ్వరుని కల్యాణం

ఫిరంగిపురం: కొండమెట్ల బజారు రామాలయం వీధిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద ఆదివారం స్వామి కల్యాణం నిర్వహించారు. తొలుత సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామికి వేదపండితులు విశేష అలంకారం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి కల్యాణం చేశారు. పూజల్లో 44 మంది దంపతులు కూర్చున్నారు. మూడువేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



మంగళగిరిలో నిమజ్జనానికి బయలుదేరిన గణనాథుడు



తాడేపల్లిలో నిమజ్జనోత్సవంలో కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు



ప్రాతూరు రోడ్డులో వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలంపాట

అంతర పంటలతో అధిక దిగుబడి



ఫిరంగిపురం: అంతర పంటలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం స్టేట్ టీం సభ్యులు కిరణ్మయి అన్నారు. వేములూరిపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తున్న రైతుల పొలాలను ప్రకృతి వ్యవసాయం స్టేట్ టీం సభ్యులు కిరణ్మయి పరిశీలించారు. ప్రత్తి, మిర్చి వంటి పొలాల్లో రైతులు అంతర పంటలుగా మునగ, ఆముదం, మరియు తీగజాతి చెట్లను పండించడం గమనించి వారిని అభినందించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం బాషా, సిబ్బంది వరలక్ష్మి, అన్నామణి, వరప్రసాద్, ఇ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోరాట యోధుడు ఏచూరి



తాడేపల్లిరూరల్: పేదల కోసం నిరంతరం పోరాడిన యోధుడు సీతారాం ఏచూరి అని జిల్లా రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. ఆదివారం ఉండవల్లిలో సుందరయ్య చౌక్‌వద్ద కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభను రాజధాని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జొన్న శివశంకరరావు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏచూరి మరణం సీపీఎంకు తీరని లోటని చెప్పారు. కోవిడ్ వల్ల కుమారుడు మరణించినా కుంగిపోకుండా ప్రజాపోరాటాలు చేసిన సీతారాం మహాపురుషుడని కొనియాడారు. కార్యక్రమంలో కె.ఈశ్వర్‌రెడ్డి, రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు, ఈమని రామారావు, దాసరి సోమయ్య, గుంటక శ్రీనివాస్‌రెడ్డి, పి. వీరాస్వామి, గాంధీ, ఎర్రోపేరు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్థలాల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్‌లోని రైల్వే స్థలాల్లో నివస్తున్న పేదలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ పేదలందరికీ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని, దాంతోపాటు టీడీపీ ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు. పోలకంపాడు నుంచి టీటీ యార్డు వరకు డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని చెప్పారు. సీతారాం ఏచూరిని పార్టీ నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం మహాసభ కార్యదర్శిగా దర్శనపు విజయబాబు, సహాయ కార్యదర్శిగా యనమాల శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మన్నెం లీలమ్మ, సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు దొంతిరెడ్డి శ్రీనివాసమారి, గాదె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



సమావేశమైన సీపీఎం నాయకులు

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు, నిత్యావసరాలు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ బిల్డర్ మాజేటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ ఇవ్వడంతో పాటు దసరా పండుగను పురస్కరించుకుని రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసరాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వ్యాపారవేత్త ఎం.రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దానగుణానికి మారుపేరు అని, అవోపా ద్వారా విద్య, వైద్య సేవలతో పాటు, ప్రతివారం గో సేవ, ప్రతిభావంతులైన ఉపకార వేతనాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా పలువురు ఇంజినీర్లు పానకాలు, నారాయణరావు, శివరాం ప్రసాద్, మాజేటి ధీరజ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఇంజినీరు పానకాలు రూ.36 వేలను పెన్షన్ స్కీమ్‌కి విరాళంగా అదంజేశారు. కార్యక్రమంలో కూర్నాల సతీష్, అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు మద్ది సాయి రమేష్, వెంకట్రావు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, చామర్తి రమేష్ పాల్గొన్నారు.



పేదలకు పెన్షన్, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మాజేటి ప్రసాద్, రామలింగేశ్వరరావు, అవోపా ప్రతినిధులు

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు వేగంగా చేయాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో డ్రెయిన్ల మీద ఆక్రమణల తొలగింపు వేగంగా జరుగుతుందని, దశలవారీగా నగరంలోని డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కమిషనర్ కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్‌లో డ్రెయిన్ల ఆక్రమణలు తొలగింపు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో డ్రెయిన్లపై ఆక్రమణలను దశల వారీగా పూర్తి స్థాయిలో తొలగిస్తామని స్పష్టం చేశారు. ఓల్డ్ క్లబ్ రోడ్‌లో కొన్ని హాస్పిటల్స్ డ్రెయిన్లపై శ్లాబ్‌లు వేసి జనరేటర్లు, కార్ పార్కింగ్‌లకు వినియోగిస్తున్నారని, దీనివలన డ్రెయిన్లలో ఉన్న సిల్ట్ తీయడానికి వీలు లేకుండా పోతుందన్నారు. డ్రెయిన్ మీద ఉన్న ప్రతి ఆక్రమణ తొలగించాల్సిందేనన్నారు. ఆక్రమణల తొలగింపునకు విధులు కేటాయించబడిన ప్రతి ఒక్క అధికారి, కార్యదర్శి పూర్తి స్థాయిలో విధుల్లో ఉండాలన్నారు. ఆక్రమణల తొలగింపు వ్యర్థాలను ఎప్పటికప్పుడు నగరంలోని జీఎంసీకి చెందిన లో లెవల్ స్థలాల్లో మెరక చేయడానికి తరలించాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ పి.సమత, తూర్పు ఎంహెచ్ఓ (ఇంచార్జి) రామారావు, ఈఈ కోటేశ్వరరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, టీపీఎస్ రసూల్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

నెహ్రూనగర్: విజయవాడ వరద బాధితులకు నిత్యావసరాలతో కూడిన కిట్స్ అందించిన గుంటూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం సభ్యుల చొరవ అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. ఆదివారం స్థానిక కన్నావారి తోటలోని గుంటూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం సభ్యులు విజయవాడ సింగ్ నగర్‌లో వరద బాధితులకు అందించనున్న 400 కిట్స్ వాహనాన్ని నగర కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తాము 12 రోజులు సహాయక, పునరుద్ధరణ చర్యల్లో నేరుగా పాల్గొని, అక్కడి ప్రజల కష్టాలను గమనించామని చెపారు. వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సి ఉందన్నారు. గుంటూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం బియ్యం, కందిపప్పు, నూనె, వంటి 7 రకాల నిత్యావసర సరుకులతో కూడిన సుమారు రూ.4 లక్షల విలువైన 4 వందల కిట్స్ అందించడం అభినందనీయమన్నారు. సీనియర్ సంఘ కాపరి రెవ.ఎం.గాబ్రియేలు పాల్గొన్నారు.

నేడు మెగా యూత్ ఫెస్ట్

తెనాలి అర్బన్: జీసెస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం తెనాలిలో మెగా యూత్ ఫెస్ట్‌ను నిర్వహించనున్నట్లు డాక్టర్ ఆర్.జయపాల్ శాస్త్రి తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌లను ఆదివారం తెనాలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫెస్ట్ కొనసాగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా సినీ నటుడు, రాజా ఫెయిత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ రాజా హెబెల్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.సుధాకర్, కె.కుమార్‌రాజు, ఎం.యాకోబు, పి.దుర్గారావు, ఆర్.ఆనంద్, ఆర్.విక్టర్‌పాల్, ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జయపాల్ శాస్త్రి, సుధాకర్ తదితరులు

వరద బాధితులకు చేయూత

తెనాలి: వరద బాధితులకు ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ మానవత తెనాలి శాఖ ఆధ్వర్యంలో సాయం చేశారు. పెదలంక, ఆముదలాలంక, గుంటూరు గూడెం, పెసర్లంక గ్రామాలకు చెందిన 350 పేద కుటుంబాలకు ఆదివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. సుగ్గునలంక, చిలుమూరు లంక, చింతల్లంక గ్రామాల్లోని 450 కుటుంబాలకు దుప్పటి, టవళ్లు అందజేశారు. దుప్పట్లను మానవత సంస్థ ప్రొద్దుటూరు శాఖ సమకూర్చింది. మానవత తెనాలి రీజినల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ కటకం ప్రసాద్ (ఓంకార్ ప్రసాద్) పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వర్తించారు. విరాళాలు ఇచ్చిన వారికి ప్రొద్దుటూరు శాఖ చైర్మన్ కళావతి, సభ్యుడు చంద్రశేఖరరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పరిమి వాసు, పి.వెంకట్‌లు సరుకులను పంపిణీ చేశారు. జె.నరసింహారావు, ఎ.ప్రభాకర్, డి సోమయ్య శాస్త్రి, వై.రోహిణి, ఓ ధనలక్ష్మి, మల్లికార్జున రావు, భుజంగరావు, మల్లాది అర్జున, దుర్గాప్రసాద్, ఓ.నాగేశ్వరావు, డాక్టర్ ఆంజనేయులు, అక్కల శ్రీరామ్, ఆలపాటి వెంకట్రామయ్య, ఎ.లక్ష్మీకాంతరావు, కేశవరావు, ఈఎల్‌వీ అప్పారావు, ఎస్‌వీ శర్మ, వీవీ జయ రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు. వరద బాధిత లంక గ్రామాల ప్రజలకు తమ వంతు సాయం చేసేందుకు ది తెనాలి వెండి, బంగారు నగల వర్తకసంఘం ముందుకొచ్చింది. రూ.2 లక్షల విలువైన నిత్యావసర వస్తువులను 200 కిట్లుగా ప్యాక్ చేయించి, శనివారం కొల్లూరు మండలంలోని చిలుమూరులంక గ్రామస్తులకు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు నేమీచంద్ గోవాణి, కార్యదర్శి వెల్లంపల్లి సత్యనారాయణమూర్తి, చలువాది కిరణ్ కుమార్, కొత్తమాసు సురేష్‌బాబు, కొత్తమాసు లక్ష్మీనారాయణ, కొల్లూరు హర్ష, కొల్లూరు సత్యనారాయణ, అప్పల మోహన్, పట్నాల మణి, కొత్తమాసు ఆనంద్, మురికిపూడి సాయిశరత్ పాల్గొన్నారు.



నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న డాక్టర్ రామ్‌చంద్, ప్రసాద్ తదితరులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



లక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని వీఆర్ విత్ యూ ఫౌండేషన్ చైర్మన్ ఎస్.అయ్యప్ప అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో ఆదివారం యువజన సర్వీసుల శాఖ స్టెప్, స్వశక్తి గుంటూరు ఆధ్వర్యంలో వీఆర్ విత్ యూ ఫౌండేషన్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సంస్థ చైర్మన్ అయ్యప్ప ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల ప్రమాదకర పరిస్థితిలో, అత్యవసరంగా వినియోగించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. స్టెప్ మేనేజర్ బి.రాధిక మాట్లాడుతూ రక్తదానం అనేది ప్రాణదానంతో సమానమని అన్నారు. రక్తదానం ఎంత మేలు చేస్తుందంటే ఎదుటి వ్యక్తి ప్రాణాలను రక్షించి వారికి పునర్జన్మను ఇస్తుందని తెలిపారు. రక్తదానం చేసేందుకు ప్రధానంగా యువత స్వచ్ఛందంగా ముందుకు రావల్సిందిగా పిలుపునిచ్చారు. అనంతరం రక్తదానాన్ని 80 మంది యువతీ, యువకులు చేశారు. రక్తదానం చేసిన వారికి ప్రమాద బీమా(లక్ష రూపాయల) పత్రాన్ని అందజేశారు.

అక్టోబర్ 2 వరకు పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్

తెనాలి అర్బన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వచ్చే మంగళవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ డ్రైవ్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ప్రజలకు పారిశుద్ధ్య కార్యక్రమాలపై అవగాహన, వార్డులలోని కాల్వలు శుభ్రం చేయడం, తీసిన వ్యర్థాల తొలగింపు, రోడ్ల మరమ్మతులు, ఖాళీ స్థలాల్లో చెత్త తొలగింపు, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల మందు పిచికారి, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయడం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం వార్డుల వారీగా ఫాగింగ్, రోడ్లపై ఉన్న భవన నిర్మాణ సామగ్రి తొలగించుట వంటివి చేయనున్నట్లు వివరించారు. ఉద్యోగులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

తెలుగు భాషా, పద్యాల ప్రాధాన్యం మరిచిపోవద్దు

నగరంపాలెం: రామబ్రహ్మం నిగర్వి, సాధుస్వభావుడు, చతురుడు అని మహర్షి బాదరీనారాయణ్ వ్యాససమ్మాన్, రాష్ట్ర పతి పురస్కార గ్రహీత ఆచార్య అద్దంకి శ్రీనివాస్ అన్నారు. బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కళావేదికపై ఆదివారం ఉదయం గుళ్లపల్లి సుబ్బారావు సేవా సంస్థ అధ్యక్షులు గుళ్లపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో భాషాసమ్మాన్ పురస్కారగ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. సభకు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అద్దంకి శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక ప్రముఖ పురస్కారాలతో పాటు భాష సమ్మాన్ ఆయన నిరంతర కృషికి నిదర్శనమని అన్నారు. సన్మానగ్రహీత రామబ్రహ్మం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తెలుగు భాషా సాహిత్య సుస్థిరతకు కృషి చేయాలని చెప్పారు. భావి తరాలు తెలుగు భాషా, పద్య విశేషాలను మరిచిపోకుండా వారిని ఈ రంగంలో ప్రోత్సహించాలని అన్నారు. సభలో కొమాండూరు రంగనాథాచార్యులు, డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు, సంస్థ కన్వీనర్ రాఘవేంద్ర, నేహా తదితరులు పాల్గొన్నారు.

రజక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

లక్ష్మీపురం: రజక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ డి.రామారావు అన్నారు. స్థానిక గుంటూరు కలెక్టర్ ఆఫీస్ ఆవరణలోని రెవెన్యూ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రజక ఉద్యోగుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఐకమత్యంగా ఉండాల్సినందిగా సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు తాము ఉన్నామని ఎలాంటి సమస్యలు ఉన్న ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. ఈ సందర్భంగా హాజరైన రజక ఉద్యోగులు త్వరలో ఒక సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ బహ్మయ్య, ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు బండి శ్రీనివాస రావు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు, వేదికపై ఎమ్మెల్యే గల్లా మాధవి